

చిలకలగుట్టకు రక్షణ వలయం

ములుగు జిల్లాలోని సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

- 8లో▸



21 నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట–కొండపల్లి రైలు మార్గంలో ఈనెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు కానున్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/28^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడ గాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది

న్యూస్‌రీల్

నర్సంపేట డిపోను పరిశీలించిన ఈడీ



నర్సంపేట: పట్టణంలో డిపోలోని వివిధ విభాగాలను శుక్రవారం ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈమేరకు డిపో ఆవరణలో ప్రత్యేకంగా డీఎం విజయమాధురి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈడీ వెంకటేశ్వర్లు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రయాణికులతో మరింత మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఆర్టీసీ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను సన్మానించి ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్ఎం జె.శ్రీలత, డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి, జెడ్ఎస్‌టీసీ ప్రిన్సిపల్ మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

విదేశాలకు వెళ్లాలనుకునే కార్మికులకు అవగాహన

కాళోజీ సెంటర్: విదేశాలకు వెళ్లాలనుకునే నైపుణ్యం, సెమీ స్కిల్డ్ కార్మికులకు ఈనెల 22న అవగాహన కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి శాఖ అధికారి ఎస్.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థుల వివరాలు 78935 66493, 99591 09863, 83286 02231 నంబర్లలో సంప్రదించాలని మాధవి కోరారు.

పాన్ షాప్‌లో చోరీ

నర్సంపేట రూరల్: నర్సంపేటలోని సర్వాపురం గ్రామ శివారులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ పాన్‌షాప్‌లో శుక్రవారం చోరీ జరిగింది. నర్సంపేటలోని ద్వారకపేట గ్రామానికి చెందిన కందుకూరి అశోక్ నర్సంపేట–మహబూబాబాద్ జాతీయ రహదారిపై పాన్‌షాప్, బెల్లుషాపును నడిపిస్తున్నాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాన్‌షాపు సైడ్ రేకును కత్తిరించి లోనికి చొరబడి రూ. 5వేల సిగరెట్ల ప్యాకెట్లు, రూ.5 వేల విలువైన మద్యం సీసాలు, రూ. 2వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్లు అశోక్ పేర్కొన్నాడు.

వివాదాస్పద స్థలాలపై పోలీసుల నజర్

నర్సంపేట రూరల్: వివాదాస్పద స్థలాలపై పోలీసుల నజర్ పెరిగింది. నిత్యం భూ పంచాయితీలతో గొడవలు జరిగి బాధితులు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. దీంతో వివాదాస్పద స్థలాలపై పోలీసులు దృష్టి సారించారు. నర్సంపేటలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాలకు యత్నిస్తుండడం పెరిగిపోయింది. ఇటీవల నర్సంపేటలోని 204 సర్వేనంబర్ 12 గుంటల భూమిని కొన్న కొందరు రెండ్రోజుల క్రితం చదును చేశారు. ఆ భూమిలో గత 40 ఏళ్ల నుంచి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఆభూమి విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో అటుగా వెళ్తున్న డీసీపీ కర్ణాకర్, ఏసీపీ సంపత్‌రావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నర్సంపేటలో వివాదాస్పద స్థలాలపై పోలీసుల నజర్ పెట్టి డీసీపీ స్థాయి అధికారులతో విచారణ చేపట్టి న్యాయం చేసేలా చూస్తున్నట్లు తెలుస్తోంది.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



నెక్కొండ: గొల్ల కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే.. నగదు బదిలీనే ఏకైక మార్గమని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సూరిపెల్లి, చిన్నకొర్పోలు, పెద్దకొర్పోలు, నాగారం, పనికర, గుండ్రపల్లి గ్రామాల్లో పలు డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగదు బదిలీ చేస్తే లబ్ధిదారులు తమకు నచ్చిన గొర్రెలను కొనుక్కుంటారని ఆయన పేర్కొన్నారు. గొల్ల, కురుమల డిమాండ్ల సాధనకు ఈ నెల 22న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో గొల్ల, కురుమలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు జక్కు రవి, కంచ ఐలయ్య, నాయకులు జంగిలి రాములు, మిర్యాల కుమారస్వామి, బొళ్ల రాజ్‌కుమార్, కందుల అనిల్, దయ్యాల ఐలయ్య, బొళ్ల శివకుమార్, మల్లయ్య, సతీశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

శునకం.. ప్రాణ సంకటం!

కుక్కలు మనుషుల్ని పీక్కుతింటున్నాయి. గుంపులుగా దాడి చేస్తున్నాయి. వరంగల్ జిల్లాలో ఇదివరకు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారు ఎంతోమంది ఉన్నారు. శుక్రవారం కాజీపేటలో సంచార కుటుంబానికి చెందిన ఓ బాలుడు కుక్కల దాడిలో మృతి చెందగా.. గుంజేడు జాతరలో 10 మంది భక్తులు గాయపడ్డారు.



- కుక్కల దాడిలో జిల్లాలో గతంలో పలువురి మృతి
- అనేక మందికి గాయాలు
- శుక్రవారం గుంజేడు జాతరలో 10 మందికి గాయాలు
- కాజీపేటలో బాలుడి మృత్యువాత



గుంజేడు జాతరలో కుక్కల దాడిలో గాయపడిన భక్తుడు



గతంలో నెక్కొండలో మండలంలో గాయపడిన బాలిక


నర్సంపేట: జిల్లా ప్రజలకు భౌభౌ భయం పట్టుకుంది. వీధి కుక్కల దాడులతో జనాలు హడలెత్తిపోతున్నారు. శునకాలు ఎటు నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కాజీపేటలో బహిర్భూమికి వెళ్లిన చోటు(7)ని కుక్కలు కరిచి చంపాయి. అదే విధంగా కొత్తగూడ మండలం గుంజేడు జాతరలో 10 మంది భక్తులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈనెల 3న నర్సంపేట నియోజకవర్గంలోని గుండ్రపల్లికి చెందిన వీరమ్మ అనే వృద్ధురాలిపై కుక్కలు దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు అనేకం జరిగాయి. ఇవి పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమను సంరక్షించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా చాలా కాలం నుంచి కుక్కల బెడద ఉంది. గతంలో వీధి కుక్కల దాడిలో ఎంతో మంది గాయపడ్డారు. సాయంత్రం వేళ ఆరు బయట ఆడుకుంటున్న చిన్నారులపై సైతం కుక్కలు దాడి చేశాయి. రోడ్డు మీద వెళ్లే వాహనాల వెంట పడి వాహనదారులను గాయాలపాలు చేశాయి. నెక్కొండ మండలంలో ఇటీవల కుక్కల దాడిలో దాదాపు ఎనిమిది మంది గాయాలపాలయ్యారు.

పట్టణంలోనూ తప్పని బాధ

నర్సంపేట పట్టణంలోనూ కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి వేళ ఆలస్యంగా ఇళ్లకు వెళ్లే వాళ్లు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితులున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యాపారస్తులు, వివిధ దుకాణాల్లో పని చేసేవారు రాత్రి పదింటి తర్వాత గానీ ఇళ్లకు చేరుకోరు. ఈక్రమంలో పట్టణ శివారు కాలనీల్లో నివాసం ఉండే వారు తమ ఇళ్లకు వెళ్లాలంటే భయపడుతున్నట్లు చెబుతున్నారు.

ఆహార వ్యర్థాలే కారణమా?

కుక్కల దాడులకు ఆహార వ్యర్థాలే కారణమా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. నగరంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్ల వ్యర్థాల్ని ఇష్టం వచ్చిన చోట్ల పడేయడంతో వాటిని కుక్కలు తిని పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయనే పలువురు పేర్కొంటున్నారు.



ఫిర్యాదు చేసినా పట్టించుకోని పాలకులు

వీధి కుక్కల బెడదపై ఫిర్యాదులున్నా.. పంచాయతీ, మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఆగమేఘాల మీద వీధుల్లో కుక్కల వేటకు బయల్దేరి ఆ మరుసటి రోజే మర్చిపోతున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మరో దుర్ఘటన జరగక ముందే పంచాయతీ, మున్సిపల్ పాలకవర్గాలు కళ్లు తెరచుకుని ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. పాలకులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టకుండా వీధి కుక్కల విషయంలో శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఇటీవల జిల్లాలో జరిగిన మరికొన్ని ఘటనలు

- ఖానాపురంలో ఈ నెలలో ఆరుగురిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.
- నర్సంపేట టౌన్‌లో ఈ ఏడాది 8 మంది కుక్కల దాడిలో గాయపడ్డారు.
- వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఇల్లందలో ఒకరు, నల్లబెల్లిలో ఒకరు కుక్క కాటుతో గాయపడ్డారు.
- పర్వతగిరి మండలకేంద్రంలో ఒకరిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది.

వీధి కుక్కలతో భయాందోళనలు

వర్ధన్నపేట: వీధి కుక్కలు వర్ధన్నపేట పట్టణంలో గుంపులుగా తిరుగుతున్నాయి. చికెన్, మటన్ సెంటర్ల వద్ద గుంపులుగా సంచరిస్తున్నాయి. అయినా మున్సిపాలిటీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కాజీపేట ఘటనతో చిన్నపిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పిల్లలను బయటకు పంపించాలంటే జంకుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బాధ నుంచి తమను రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భయమేస్తోంది..



పట్టణంలోనే కాకుండా డీసీ తండా, కోనాపురం పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అవి దాడి చేస్తాయని భయమేస్తోంది. అధికారులు స్పందించి వీధికుక్కల దాడుల నుంచి కాపాడాలి.

– ఈరెల్లి శ్రీనివాస్, వర్ధన్నపేట

ఆడ శిశువు @ 5 కేజీలు



వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం 5 కిలోల బరువుతో ఓ ఆడ శిశువు జన్మించింది. కొడకండ్ల మండలం నర్సింగపురం గ్రామానికి చెందిన బూరుగు ప్రవళిక మొదటి కాన్పు కోసం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు థైరాయిడ్ లోపం ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. శుక్రవారం ప్రవళికకు ఆపరేషన్ చేయగా.. ఆడ శిశువు జన్మించింది. ఆశిశువు 5 కేజీల బరువు ఉండడంతో అందరూ ఆశ్చర్యపోయారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ బరువుతో అరుదుగా జన్మిస్తారని, ప్రవళికకు థైరాయిడ్ సమస్య వల్ల శిశువు ఎక్కువ బరువు జన్మించిందని వైద్యులు తెలిపారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయండి

- ఆర్డీఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

నర్సంపేట: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అధికారులు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధి ఆరు మండలాల తహసీల్దార్‌లు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున అధికారులు సర్వం సిద్ధం చేసుకోవాలన్నారు. తుది ఓటర్ల జాబితాను ఫైనల్ చేయాలని, మార్పులు, చేర్పులు ఉంటే ఈలోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఓటర్లపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. రాజకీయ నాయకులు తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా సంప్రదించి అభిప్రాయాలను వ్యక్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

- రూ.7కోట్లతో బీటీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన



గురిజాలలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో రూ.7 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.40 కోట్ల నిధులతో రాంనగర్ నుంచి నారక్కపేట వరకు బీటీ రోడ్డు శంకుస్థాపన, రూ.1.61 కోట్లతో నిధులతో చంద్రయ్యపల్లి నుంచి నారక్కపేటకు వరకు బీటీ రోడ్డు శంకుస్థాపన, రూ.72 లక్షల నిధులతో కమ్మపల్లి బీటీ రోడ్డు నుంచి చక్రంతండా బీటీ, సీతారం తండా వరకు బీటీ రోడ్డుకు, రూ.72 లక్షల నిధులతో మాధన్నపేట నుంచి బోజ్యానాయక్‌తండా వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన, రూ.40 లక్షల నిధులతో ఇటుకాలపల్లిలో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన, రూ. 30 లక్షలతో నిధులతో ముత్తోజిపేటలో అంతర్గత సీసీరోడ్లకు శంకుస్థాపన, రూ.56 లక్షల నిధులతో జీజీఆర్‌పల్లి నుంచి గోప్రియా తండా వరకు బీటీ రోడ్డు, రూ.1.20 కోట్లతో నిధులతో గురిజాలలో అంతర్గత సీసీరోడ్లు, రూ.1.10 కోట్లతో మహేశ్వరం గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు తదితరులున్నారు.

అన్నదాతల మధ్య గొడవలు వద్దు

- డీసీపీ కర్ణాకర్



రైతులతో మాట్లాడుతున్న డీసీపీ కర్ణాకర్

దుగ్గొండి: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు సమస్యలు ఉంటే కలిసి కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని డీసీపీ పుల్లా కరుణాకర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే బాట విషయంలో రైతుల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన 50 మంది రైతులు తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి పురాతన కాలం నుంచి దారి ఉంది. అయితే చిట్టిరెడ్డి మహేందర్‌రెడ్డి తన వ్యవసాయ భూమి పక్కన ఉన్న బాటను కలుపుకున్నాడు. దీంతో మిగిలిన రైతులంతా మహేందర్‌రెడ్డితో గొడవకు దిగారు. ఈమేరకు మహేందర్‌రెడ్డి సీపీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. రైతులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. స్వయంగా భూములను పరిశీలించారు. అనంతరం పురాతన కాలం నాటి దారి అలాగే ఉండాలని రైతులు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. గొడవలతో సాధించేదేమీ లేదని సర్దిచెప్పారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు, సీఐ సూర్యప్రసాద్, ఎస్సై నవీన్‌కుమార్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీటీసీ మామునూరి సుమన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజలను చేరే కార్యక్రమాలు చేపట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

గీసుకొండ: ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ సర్కారు ఏర్పడి తొమ్మిదేళ్ల పూర్తయిన సందర్భంగా మహాజన సంపర్క్ అభియాన్ కింద ప్రజలను చేరే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు నెల రోజులు అభియాన్ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, డివిజన్లు, శక్తి కేంద్రాల, బూత్‌ల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేశ్, ఎస్టీ మోర్చా నాయకులు భిక్షంనాయక్, బీజేవైఎం నాయకులు కైరిక రవికుమార్, 16వ డివిజన్ అధ్యక్షులు గోదాసి అశ్విని పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు!

- త్వరలో గొర్రెల పంపిణీకి కసరత్తు
- ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఖరారు
- జిల్లాలో రెండో విడత దరఖాస్తులు 12,782
- లబ్ధిదారు వాటాధనం చెల్లించింది 560 మంది



గీసుకొండ: గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ఐదేళ్ల తర్వాత కదలిక వచ్చింది. తాజాగా ఈనెల 18న రాష్ట్ర మంత్రివర్గం(కేబినెట్) ఈవిషయంపై నిర్ణయం తీసుకోవడంతో ఈ పథకంపై లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రెండో విడత గొర్రెల పంపిణీని 10, 15 రోజుల్లో ప్రారంభించాలని, కేంద్రం నుంచి ఇబ్బందులు ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు గొర్రెల పంపిణీపై అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. 2017లో మొదటి విడత(ఏ–లిస్ట్) కింద జిల్లాలో 10,189 యూనిట్లను పంపిణీ చేశారు. ప్రతీ యూనిట్ కింద 20 గొర్రెలు, ఓ పొట్టేలును లబ్ధిదారులకు అందించారు. ఆతర్వాత రెండో విడత(బి–లిస్టు) తీవ్ర జాప్యం జరిగింది. చాలా ఆలస్యంగానైనా ప్రభుత్వం పంపిణీకి ముందుకొచ్చింది.

ఎన్నికల ఏడాది కావడంతో కదలిక!

రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత గొర్రెల పంపిణీని ఎన్నికలు ఏడాది ఉన్నాయనగా ప్రారంభించింది. తాజాగా రెండో విడత పంపిణీకి ఈఏడాది ఎన్నికలు ఉండడంతో ముందుకు వచ్చింది. ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ఇప్పటికే ఎంతో జాప్యం జరిగిన క్రమంలో ప్రభుత్వం ఈ విషయమై కొంత హడావిడి చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

మునుగోడు తరహాలో ఇవ్వాలని డిమాండ్

మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం గొర్రెలకు బదులు నగదు బదిలీ చేసింది. అదే తరహాలో జిల్లాలో నగదు బదిలీ చేయాలని గొర్రెల పెంపకందారుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈమేరకు ఈనెల 22న హనుమకొండ ఏకశిల పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా జరపాలని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య, అధ్యక్షులు నాగరబోయిన సారంగం, కార్యదర్శి పరికి మధుకర్ పిలుపునిచ్చారు.

రెండో విడతలో ఇలా..

- ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై గొర్రెలను అందిస్తోంది. యూనిట్ ధరను రూ. 1.25 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు పెంచారు. ప్రతీ లబ్ధిదారుడు తన వాటా కింద రూ. 43,750 చెల్లించాలి. వాటాధనం పెంపు లబ్ధిదారులకు రుచించడం లేదు.
- జిల్లాలో రెండో విడత దరఖాస్తుదారులు 12,782 మంది ఉండగా.. గురువారం నాటికి 560 మంది తమ వాటాధనం చెల్లించారు.
- ఇక నుంచి నేరుగా కలెక్టర్ ఖాతాలోకే వాటాధనం చెల్లించాలి. గతంలో డీడీల రూపంలో చెల్లించే విధానాన్ని తొలగించారు. గొర్రెల కొనుగోలుకు లబ్ధిదారులతో పశువైద్యులు వెళ్లరు. ఏడీలు, జిల్లా అధికారులు, వారి సహాయకులు యూనిట్లను గ్రౌండింగ్ చేస్తారు.
- జిల్లాలో 13 మండల స్థాయి టీంలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, వెటర్నరీ డాక్టర్, డిప్యూటీ తహసీల్దార్ టీంగా ఉండి లబ్ధిదారుల వివరాలను ఈ–ల్యాబ్‌లో నమోదు చేస్తారు.
- జిల్లాస్థాయిలో 12 బృందాలు, ఓ రిజర్వ్ టీంను ఏర్పాటు చేశారు. ఈ టీంలు ఈ–ల్యాబ్‌లో నమోదు చేసిన లబ్ధిదారుల వివరాలు పరిశీలించి అవి సరిగ్గా ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు.
- ఏపీలోని కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటకలోని భాగల్ కోట్ నుంచి గొర్రెలను కొనుగోలు చేసి తీసుకొస్తారు.
- గొర్రెలను తీసుకు రావడానికి ఇప్పటికే ట్రాన్స్‌పోర్టు టెండర్లను ఖరారు చేశారు. లారీలు/ట్రక్కులకు జీపీఎస్ సిస్టంను అనుసంధానం చేసి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటారు.

22 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

కాశిబుగ్గ: ఈనెల 22 నుంచి 24 వరకు వరంగల్ ఓ సిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరగనున్నట్లు జిల్లా క్రీడల అధికారి ఎస్.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో మూడ్రోజుల పాటు పోటీలు జరిగాయని, గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 22న ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, 23న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు ఓ సిటీ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. స్విమ్మింగ్, బాక్సింగ్ పోటీలు హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. 24న ఓ సిటీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, హాకీ, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో బాస్కెట్ బాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులు ఇది గమనించాలని ఇందిర కోరారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

గీసుకొండ: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేరళ తరహాలో రోజుకు రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొమ్మాలలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, కూలీ డబ్బుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే ఉపాధి కూలీల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సీహెచ్.రంగయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ టి.బ్రహ్మచారి, కొండం తిరుపతి, గాదు సాంబయ్య, టి.ఐలయ్య, కంచు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల దోపిడీని అరికట్టాలి

సంగెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్ కోరారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు, తరుగుపేరుతో బస్తాకు 3 కిలోల దోపిడీ తదితర విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోహిత ఐకేపీ సెంటర్‌కు రైతు చక్రు తీసుకుని వచ్చిన 223 బస్తాల ధాన్యాన్ని కాంటాలు వేయకుండా సంచులు ఇచ్చి రైతుల చేత నింపించి రూ.4 వేల కిరాయితో కాపులకనిపర్తి శ్రీవాణి రైస్ మిల్లుకు పంపిస్తే 32 బస్తాలు తరుగు తీశారని తెలిపారు. ప్రశ్నిస్తే ధాన్యం తీసుకోమని బెదిరిస్తున్నట్లు వాపోయారు. షాపూర్‌లో కాంటాలు వేయకుండానే.. మిల్లులకు తరలిస్తున్నారని ఈ దోపిడీని అరికట్టి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోనే రాంచందర్, రాతు శ్రీనివాస్, సాంబయ్య, రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

21 నుంచి పలు రైళ్ల రద్దు



డోర్నకల్: కాజీపేట– కొండపల్లి రైలు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులతోపాటు, చింతపల్లి, నెక్కొండ స్టేషన్ల మధ్య పనులు జరగనుండటంతో ఈ నెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు కాజీపేట –విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు కానున్నాయి.

రద్దు కానున్న రైళ్ల వివరాలు:
07753 కాజీపేట– డోర్నకల్
07754 డోర్నకల్– కాజీపేట
07755 విజయవాడ– డోర్నకల్
07756 డోర్నకల్– విజయవాడ
07464 విజవాడ– గుంటూరు
07465 గుంటూరు– విజయవాడ
17660 భద్రాచలంరోడ్– సికింద్రాబాద్
17659 సికింద్రాబాద్– భద్రాచలంరోడ్
12713 విజయవాడ– సికింద్రాబాద్
12714 సికింద్రాబాద్– విజయవాడ
07091 కాజీపేట–తిరుపతి
(మే 23, 30, జూన్ 6న రద్దు)
07092 తిరుపతి– కాజీపేట
(మే 23,30, జూన్6న రద్దు)
07185 మచిలీపట్నం– సికింద్రాబాద్
(మే21, 28, జూన్ 4న రద్దు)
07186 సికింద్రాబాద్– మచిలీపట్నం
(మే21, 28, జూన్ 4న రద్దు)

తాత్కాలికంగా రద్దయ్యే రైళ్లు..
- సిర్పూర్ టౌన్– భద్రాచలం(17034) 20వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వరంగల్, భద్రాచలం మధ్య రద్దు
- భద్రాచలం–సిర్పూర్ టౌన్(17033) 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు భద్రాచలం, వరంగల్ మధ్య రద్దు
- బెలగావి– మణుగూరు(07335) 20వ తేదీ నుంచి జూన్ 6 వరకు కాజీపేట, మణుగూరు మధ్య రద్దు
- మణుగూడు– బెలగావి(07336) 21వ తేదీ నుంచి జూన్ 7 వరకు మణుగూరు, కాజీపేట మధ్య రద్దు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎండదెబ్బకు ఆగిన గుండె



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుండమల్ల వెంకటయ్య (67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయన తన వరిచేను వద్దకు వెళ్లి పొలం కోయించి ఇంటికి తిరిగి వచ్చి ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే కొంత సమయానికి ఇంటి వద్దే మృతిచెందారు. వెంకటయ్యకు భార్య ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కడిపికొండ భూమి టీఎన్జీవోస్‌దే..!

- ఉద్యోగుల సొసైటీ భూమి వదిలే ప్రసక్తేలేదు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల నివాస స్థలాల కోసం సీఎం కేసీఆర్ కడిపికొండలో కేటాయించిన భూమిలోకి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగులు విరామ సమయంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం కడిపికొండలో కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కబ్జాల విషయం గతంలోనే కలెక్టర్, పోలీస్ కమిషనర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఉద్యోగులపై కొంత మంది దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఈవిషయాన్ని ఉద్యోగ సంఘాల ఏజేసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగుల భూమి ఆక్రమణకు ప్రోత్సహిస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. దోషులను శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. గెజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. సీఎం స్వయంగా ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న కొంతమంది అధికారుల వైఖరి వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే కలెక్టర్, సీపీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, వేణుగోపాల్, బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాగరాజు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, సభ్యులు వేణుగోపాల్, రమేష్, అశోక్, శ్యాంసుందర్, వెంకట్రామ్‌రెడ్డి, సారంగపాణి, భూక్య రాము, డాక్టర్ ప్రవీణ్, సురేష్, బింగి సురేష్, రాజేష్‌ఖన్నా, రాజీవ్, అనుప్, భరత్, ప్రణయ్, రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయధికారి విజ్ఞాన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



ఎరువులు, విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి జి. విజ్ఞాన్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో అందుబాటులో ఉన్న పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇతర పంటల విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులను పరిశీలించారు. సుమారు 25 విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, ఏఓ విజ్ఞాన్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ గల షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బ్రోకర్ల మాయమాటలు నమ్మొద్దని, లూజు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారివద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మేలైన విత్తనాలు కొనుగోలు చేసి బిల్లు తీసుకోవాలని, పంట ముగిసే వరకూ భద్రపర్చుకోవాలని చెప్పారు. పంట దిగుబడులు రానిఎడల అధికారులకు తెలిపి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. విత్తన బ్రోకర్ల మాటలు నమ్మొద్దని వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, సాంబయ్య, కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'నిట్'ల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్: దేశ వ్యాప్తంగా 31 నిట్‌ల బలోపేతానికి కృషి చేసేందుకు నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో శుక్రవారం టు వర్డ్స్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నిట్స్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. దేశవ్యాప్త నిట్‌లను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని అన్నారు. నిట్‌ల బలోపేతానికి దేశవ్యాప్త నిట్‌లను ఏకం చేసేందుకు నిట్ వరంగల్ ముందడుగు వేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో 1959లో తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నాడు ఆర్ఈసీ నేటి నిట్ దేశ వ్యాప్త 31 నిట్‌లకు పెద్దన్నగా నిలుస్తుందని నిట్ రూర్కేలా రిటైర్డ్ డైరెక్టర్, ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సారంగి తెలిపారు. న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ–2020 అనుగుణంగా విద్యాబోధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్ రూర్కేలా డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, నిట్ వరంగల్ రిజిస్ట్రార్ గోవర్దన్‌రావు, ప్రొఫెసర్లు వీరాంజనేయులు, దేశవ్యాప్త నిట్‌ల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బదిలీలు..?

- సోమవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ , రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్లతో కూడిన ఓ కమిటీ బదిలీల ప్రక్రియపై కసరత్తు ప్రారంభించనట్లు తెలిసింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన గ్రేడ్–1, గ్రేడ్–2 మూడేండ్లు నిండిన సబ్ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం బదిలీల సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు బదిలీలకు బ్రేక్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు వినికిడి.

గంజాయి విక్రయదారు అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్: ఎల్‌బీ నగర్‌లోని జియా మసీదులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ.. వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న అమన్ హజీజ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి అమ్మకాలు, వినియోగం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులతో కలిసి కమిషనర్ టాస్క్ ఫోర్స్ వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు, వినియోగంలో పాల్గొంటుండగా హజీజ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి కిలో 200గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హజీజ్ గత ఏడాది నుంచి గంజాయి విక్రయాలు, సేవించడం అలవాటు చేసుకుని, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు నిందితున్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నిస్సార్‌పాషా, బి.శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్లోనిపల్లిలో కుల బహిష్కరణ

- భూమి రిజిస్ట్రేషన్ చేయడంలేదని కుల పెద్దల నిర్ణయం
- పాలు పోయకూడదని హుకుం జారీ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి: కుల సంఘానికి రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్ చేయించడంలేదని ఓ కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లికి చెందిన తిప్పని పెద్దసారయ్య గౌడ్ గ్రామానికి చెందిన గీతకార్మిక సంఘంలో చిట్టీ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. చిట్టీ డబ్బులు తీసుకున్న ఇద్దరు సభ్యులు కొన్నాళ్ల తర్వాత మృతి చెందారు. వీరితోపాటు మరికొందరు సభ్యులు సంఘానికి చెల్లించాల్సిన చిట్టీ డబ్బు ఇవ్వలేదు. దీంతో సంఘం పెద్దలు పెద్ద సారయ్యను బాధ్యుడిగా చేస్తూ నువ్వే చెల్లించాలని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేసి ఎకరం భూమిని బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమిని గౌడ సంఘం పేర రిజిస్ట్రేషన్ చేయాలని కుల పెద్దలు గట్టు సమ్మయ్య, తిప్పని రవీందర్, లింగమూర్తి, మాదాసు ఐలయ్యలతో పాటు పలువురు పెద్ద సారయ్య కుటుంబంపై ఒత్తిడి చేస్తూ మానసికంగా వేధిస్తున్నారు. ఇదిలా ఉండగా పెద్ద సారయ్య కుమారుడు శ్రీనివాస్ తన భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా విషయం తెలుసుకున్న కుల పెద్దలు అక్కడికి చేరుకొని అడ్డుకుని.. సంఘానికి రాసిచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే వరకు భూమిని దున్నకూడదని బెదిరించారు. అందుకు అంగీకరించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసే వరకు పెద్ద సారయ్య కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు నిర్ణయించారు. వారితో మాట్లాడితే రూ.5 వేలు జరిమానా చెల్లించాలని, పాలు కూడా పోయకూడదని హుకుం జారీ చేసినట్లు బాధితుడు పెద్ద సారయ్య పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్సై నైనాల నగేష్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు పరికి కొర్నేల్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని వడ్డెపల్లి చెరువు కట్ట రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం .. సుమారు 59 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.4 ఎత్తు, చామన ఛాయ, తెలుపు రంగు చొక్కాపై ఎరుపు గీతల లైన్లు, బూడిద రంగు ప్యాంట్, ఎడమ చేతిపై డీఏఆర్ అని పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ 9493201968లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడతాం

- సీపీఎం నేత నాగయ్య



నినాదాలు చేస్తున్న నాగయ్య, నాయకులు

కరీమాబాద్: పేదల ఇళ్లకు పట్టాలు వచ్చే వరకు పోరాడతామని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు జి.నాగయ్య అన్నారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. కరీమాబాద్ సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భట్టుపల్లి రోడ్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని గుడిసెల ప్రాంతాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. పేదలు వేలాది రూపాయల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు సంబంధించి ఎన్నికల వాగ్దానం ప్రకారం జీఓ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు హామీలకే పరిమితమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మరోసారి పేదలను మోసం చేయడానికి కుటిల బుద్ధితో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. గుడిసెల పోరాటంలో మహిళలదే కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రత్నమాల, ముక్కెర రామస్వామి, సాగర్, యాదగిరి, బషీర్, అరుణ్‌కుమార్, మధుకర్, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలతో ముందుకెళ్లాలి

ఖిలా వరంగల్: భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలతో సీపీఎం శ్రేణులు, యువత ముందుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ శంభునిపేటలో ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మికుల కూలి రెట్ల పెంపు కోసం ఉద్యమాలు చేసిన ఘన ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ప్రత్యూష, సాంబమూర్తి, గణే పాక ఓదెలు, లక్క రమేష్, రత్నం దాసు ,జ్యోతి, గజ్జ చందు, ఉసిల్ల కుమార్ పాల్గొన్నారు.

చిలకలగుట్టకు రక్షణ వలయం

- ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం
- పూజలు నిర్వహించిన పూజారులు, అధికారులు



చిలకల గుట్ట (ఫైల్)



పూజలు చేస్తున్న ట్రైబల్ ఈఈ హేమలత

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగుజిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. చిలకల గుట్టపై కొలువుదీరిన సమ్మక్క తల్లిని పూజారులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి కుంకుమ భరణి రూపంలో గద్దె పైకి తీసుకొస్తుంటారు. తల్లి కొలువుదీరిన పవిత్ర గుట్టకు రక్షణగా అధికారులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు తల్లివారం (ఈనెల 18) గురువారం పూజారులు, అధికారులు కలిసి పూజలు నిర్వహించారు. గతంలో కొంతమేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. గుట్టకు ఫెన్సింగ్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రులు, అధికారులను పూజారులు ప్రతి జాతరలో కోరుతున్నారు. ఎట్టకేలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పూజారులు, భక్తుల కల నెరవేరనుంది.

రూ.60లక్షల నిధులు..

ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలకలగుట్ట చుట్టూ 425 మీటర్ల పొడువున ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గుట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సమ్మక్క తల్లి కొలువుదీరిన గుట్టపైకి భక్తులు, స్థానిక ప్రజలు ఎక్కడం వల్ల అపవిత్రం అవుతుందని పూజారుల నమ్మకం. గత నాలుగు జాతరల క్రితం గుట్ట చుట్టూ కొంత మేర (600 మీటర్ల) వరకు జాలి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ఫెన్సింగ్ పనులు ఈ సారి పూర్తి చేయనున్నారు. 2024, ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందుగానే ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలుకలగుట్టకు రక్షణ కవచం పనులు మొదలయ్యాయి. దీంతో తల్లి గుట్టకు రక్షణ లభించనుంది.

పవిత్రమైన గుట్టను కాపాడేందుకే..

సమ్మక్క తల్లి స్వయాన కొలువు ఉన్న చిలకలగుట్ట పైకి భక్తులు, ప్రజలు ఎక్కేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా గుట్టపై వనమూలికలు కూడా ఉన్నాయని, వాటిని సేకరించేందుకు కొందరు గుట్టను ఎక్కేందుకు ప్రయత్నిస్తుంటారు. మహాజాతర సమయంలో మిగతా రోజుల్లో వచ్చే భక్తులు చిలుకలగుట్ట వద్ద సేదతీరి వంటావార్పు చేసుకుంటే మోక్షం కలుగుతుందని విశ్వాసం. దీంతో భక్తులు ఎక్కువ మంది గుట్ట పరిసరాల్లో విడిది చేస్తుంటారు. భక్తులు, ఇతరులు గుట్ట పరిసరాల్లో వేసిన వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా తయారవుతాయి. ఫెన్సింగ్ ఏర్పాటుతో ఎవరు కూడా గుట్టపైకి వెళ్లేందుకు వీలుండదు. ఫెన్సింగ్ ఏర్పాటుతో సమ్మక్క సారలమ్మ పూజారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి..



చిలుకలగుట్ట చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించగా, ఇప్పటికి కార్యరూపం దాల్చడంతో పూజారుల కల నెరవేరనుంది. మహాజాతర సమయంలో చిలుకలగుట్ట పైకి పూజారులు తప్ప మిగతా ఎవరు కూడా వెళ్లకూడదు. కానీ ఇన్ని రోజులు ఫెన్సింగ్ లేకపోవడంతో మేడారానికి వచ్చే భక్తులు గుట్టపైకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో గుట్ట అపవిత్రమవుతుంది. ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు